
సాక్షి
నిజామాబాద్

శనివారం । 7 । అక్టోబర్ । 2023



తాగి దొరికితే జైలుకే..

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని, జైలుశిక్షతో పాటు జరిమానా కట్టాలని పోలీసులు పేర్కొంటున్నారు.

- 8లో ▸



లక్ష్యం దిశగా విద్యుదుత్పత్తి

ఎస్సారెస్పీలోని జల విద్యుదుత్పత్తి కేంద్రంలో అధికారులు లక్ష్యానికి అనుగుణంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

- 8లో ▸



వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం మేఘావృతమవుతుంది. రాత్రివేళ చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్‌

జాతీయ యాత్రా కేంద్రంగా శబరిమలను ప్రకటించాలి

- రాష్ట్రపతికి గురుస్వామి మనోహర్‌ రెడ్డి లేఖ

నిజామాబాద్‌ సిటీ : ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు సందర్శించే శబరిమల సన్నిధానాన్ని జాతీయ యాత్రా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ శబరిమల సన్నిధానం అయ్యప్ప హెల్త్‌ సొసైటీ సభ్యుడు జి మనోహర్‌రెడ్డి రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు లేఖ రాశారు. కేరళలోని శబరిమలలో అయ్యప్ప ఆలయంలో ప్రతి నెలలో ఆరురోజుల పాటు తెరిచి ఉంటుంది. అయితే ఆలయానికి లక్షలాది మంది భక్తులు వస్తున్నప్పటికీ ప్రత్యేక రైళ్లు నడపడం లేదని ఆయన లేఖలో పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల సీఎంలు తమ తమ రాష్ట్రాల్లోని పవిత్ర స్థలాలను సందర్శించి ఆలయాల పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. నవంబర్‌ నుంచి జనవరి వరకు లక్షల్లో వచ్చే భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్యావసతి కల్పించాలి



నిజామాబాద్‌నాగారం : గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి కల్పించాలని, ఇరిగేషన్‌, ఆర్‌అండ్‌బీ, పీఆర్‌ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్‌ విఠల్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, గురుకులాలు, ఇరిగేషన్‌, ఆర్‌అండ్‌బీ, పీఆర్‌ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చేది చలికాలం కాబట్టి విద్యార్థులకు వసతి గృహాల్లో దుప్పట్లు, దోమల నివారణకు, చర్యలు తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. ముఖ్యంగా తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీలు అంబర్‌సింగ్‌, నర్సవ్వ భాస్కర్‌రెడ్డి, సంతోష్‌, సవిత, జడ్పీ సీఈఓ గోవింద్‌, ఈఈలు భావన్న, శంకర్‌, రాకేష్‌, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో మూడు రకాల కోర్టులు ఏర్పాటు

ఖలీల్‌వాడి : జిల్లాలో మూడు రకాల కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ న్యాయ వ్యవహారాల కార్యదర్శి తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. బాలలపై లైంగిక దాడులు నిరోధక న్యాయ విచారణ జరిపేందుకు వీలుగా జిల్లాకు ప్రత్యేక ఫోక్సో కోర్టు ఏర్పాటు చేశారు. అలాగే అదనపు పని భారం అత్యధిక సివిల్‌, క్రిమినల్‌ కేసులు ఉన్న నేపథ్యంలో నిజామాబాద్‌ అసిస్టెంట్‌ సెషన్స్‌ కోర్టు (సీనియర్‌ సివిల్‌ జడ్జి)కు అదనంగా నిజామాబాద్‌ అదనపు సెషన్స్‌ కోర్టు(అదనపు సీనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టు)ను ఏర్పాటు చేశారు. నిజామాబాద్‌ ప్రిన్సిపాల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టుకు పని భారం తగ్గించేందుకు వీలుగా నిజామాబాద్‌ అదనపు ప్రిన్సిపాల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టును ఏర్పాటు చేశారు. నూతన కోర్టుల ఏర్పాటుపై రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ సభ్యులు మందని రాజేందర్‌ రెడ్డి, నిజామాబాద్‌ బార్‌ ఆసోసియేషన్‌ అధ్యక్షులు దేవిదాస్‌, ఉపాధ్యక్షులు ఆశనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

ఆరోగ్యశ్రీ సేవల బహిష్కరణ

నిజామాబాద్‌ నాగారం : ప్రభుత్వ, ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు బహిష్కరించారు. ఆరోగ్యమిత్రలు అందరూ స్వచ్ఛందంగా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని మూడు రోజుల పాటు సేవలు నిలిపేశారు. ఈనెల 6, 7, 8 తేదీల్లో ఆరోగ్యమిత్రలు విధులు బహిష్కరించి నిరసన తెలుపనున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిరసన తెలపడానికి వెళ్లారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 68 మంది ఆరోగ్యమిత్రలు ప్రభుత్వ, ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్నారు. 15 ఏళ్లుగా రూ. 15వేల జీతంతో విధులు నిర్వహిస్తున్నారు. తమ క్యాడర్‌ మార్చాలని, జీతాలు పెంచాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, ట్రస్ట్‌ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్‌ చేస్తున్నారు.

టీచర్ల బదిలీలకు బ్రేక్‌

నిజామాబాద్‌ అర్బన్‌ : ఉపాధ్యాయ బదిలీలకు బ్రేక్‌ పడింది. ఈనెల 19 వరకు ఎలాంటి బదిలీ చేపట్టవద్దని శుక్రవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రక్రియ నిలిచిపోయింది. ఇదివరకే స్కూల్‌ అసిస్టెంట్‌ విభాగంలో కొందరు టీచర్లు బదిలీ అయి రిలీవ్‌ కాగా.. మరికొందరు మాత్రం రిలీవ్‌ కాకపోవడంతో అలాగే ఉండిపోయారు. దీంతో వీరు కోర్టు తీర్పు కారణంగా బదిలీకి నోచుకోలేకపోయారు. మరోవైపు ఎస్జీటీ బదిలీలకు సంబంధించి జిల్లా విద్యాశాఖ 97 మందితో మెరిట్‌ లిస్టు విడుదల చేసింది. ప్రస్తుతం కోర్టు స్టేతో ఈ ప్రక్రియ కూడా నిలిచిపోయింది.

ఇందూరులోనే పసుపు బోర్డు

- కేంద్ర కేబినెట్‌ గ్రీన్‌సిగ్నల్‌..
- జాతీయ ప్రాధాన్యత దక్కించుకున్న ఇందూరు
- జిల్లాకు పసుపు శుద్ధి, కర్కుమిన్‌, ఆయిల్‌ పరిశ్రమలు తరలివచ్చే చాన్స్‌
- ఏటేటా తగ్గుతున్న తల్లిపంట విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రోత్సాహం
- రాష్ట్ర ప్రభుత్వం భూకేటాయింపులు చేస్తే డ్రైపోర్ట్‌, విమానాశ్రయం



- దేశవ్యాప్తంగా 11.61లక్షల టన్నులు.. తెలంగాణ నుంచి సుమారు 2లక్షల టన్నుల పసుపు..
- ప్రస్తుతం వివిధ రాష్ట్రాల నుంచి 11.61 లక్షల టన్నుల పసుపు దిగుబడి వస్తోంది.
- తెలంగాణ నుంచి 2021–22 సీజన్‌లో 85,196 ఎకరాల్లో పసుపు సాగు చేయగా 2,56,029 టన్నుల దిగుబడి వచ్చింది.
- 2022–23 సీజన్‌లో రాష్ట్రంలో 56,073 ఎకరాల్లో పసుపు పంట సాగు చేయ గా 1,67,092 టన్నుల దిగుబడి వచ్చింది.
- 2023–24 సీజన్‌లో 43,159 ఎకరాల్లో పసుపు సాగు చేయగా, 1,28,614 టన్నుల మేర దిగుబడి వస్తుందని అధికారుల అంచనా.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌ : మనదేశ రైతులు పండించిన పసుపు పంటకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్‌ ఉంది. ఈ క్రమంలో మనదేశం నుంచి ప్రతి ఏటా రూ.1,600 కోట్ల మేర పసుపు ఎగుమతులు జరుగుతున్నాయి. అంతర్జాతీయ పసుపు వాణిజ్యంలో భారత్‌ వాటా 62 శాతం ఉంది. అయితే ఈ పసుపు ఎగుమతుల వాణిజ్యాన్ని రూ.8,400 కోట్లకు పెంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దేశంలో మొదటిసారిగా జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ బోర్డును ఉత్తర తెలంగాణలోని ఇందూరు జిల్లాలో ఏర్పాటు చేసేందుకు గాను తాజాగా కేంద్ర కేబినెట్‌ గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చింది. దీంతో ఉత్తర తెలంగాణ రైతాంగంలో హర్షం వ్యక్తమవుతోంది. గురువారం రాత్రి దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసింది.

తాము పండిస్తున్న పసుపు ద్వారా ఈ ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుండడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఏటేటా తగ్గుతున్న పసుపు పంట విస్తీర్ణం మళ్లీ పెంచేందుకు కేంద్రం నుంచి తగిన ప్రోత్సాహం లభిస్తుందని భావిస్తున్నారు. తద్వారా జిల్లాకు పసుపు శుద్ధి కర్మాగారాలు, కర్క్యుమిన్‌ యూనిట్లు,



కర్క్యుమిన్‌ ఆయిల్‌ ఎక్స్‌ట్రాక్ట్‌ ఎగుమతి యూనిట్లు, వివిధ పసుపు ఆధారిత పరిశ్రమలు తరలి వచ్చే అవకాశాలు ఉంటాయంటున్నారు. అమెరికా, యూఏఈ, బంగ్లాదేశ్‌, మలేసియా దేశాల్లో భారత పసుపునకు డిమాండ్‌ ఉంది. భారతదేశం నుంచి అంతర్జాతీయ పసుపు వ్యాపారాన్ని మరింత విస్తృతం చేసేందుకు ఇందూరులో పునాది వేసేందుకు కేంద్రం నిర్ణయించడంపై సంతోషంగా ఉందని రైతులు చెబుతున్నారు. పసుపు బోర్డు తీసుకొచ్చేందుకు పాటుపడిన ఎంపీ అరవింద్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రధానమంత్రి మోదీ ఇక్కడకు వచ్చి ప్రకటించడంపై తమకు తిరుగులేని గుర్తింపు దక్కినట్లైందంటున్నారు.

- జాతీయ పసుపు బోర్డుకు చైర్మన్‌ను కేంద్రం నియమిస్తుంది. వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమల శాఖలు, ఆయుష్‌, ఫార్మాసూటికల్స్‌ విభాగాల నుంచి రొటేషన్‌ విధానంలో వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులను, పరిశోధనల్లో భాగస్వామ్యమయ్యే సంస్థలు, పసుపు రైతులు, ఎగుమతిదారుల ప్రతినిధులను సభ్యులుగా నియమిస్తారు. పసుపు బోర్డు కార్యదర్శిని కేంద్ర వాణిజ్య శాఖ నియమిస్తుంది.

గత సీజన్‌లో..

- 2022–23 సీజన్‌లో నిజామాబాద్‌ మార్కెట్‌కు 75 వేల టన్నుల పసుపు వచ్చింది.
- తెలంగాణ వ్యాప్తంగా సుమారు 88 వేల టన్నుల పసుపు దిగుబడి వచ్చింది. ఇందులో అత్యధికంగా నిజామాబాద్‌ మార్కెట్‌కు వచ్చింది. రాష్ట్రంలో మొత్తం పసుపు సాగులో 40 శాతం ఒక్క నిజామాబాద్‌ జిల్లాలోనే కావడం గమనార్హం. తరువాతి స్థానాల్లో జగిత్యాల, నిర్మల్‌, వికారాబాద్‌, మహబూబాబాద్‌ ఉన్నాయి.

డ్రైపోర్టుకు భూమి కేటాయించాలి



కేంద్రం ఇందూరుకు పసుపు బోర్డు ఇవ్వడంతో జాతీయ స్థాయి గుర్తింపు వచ్చింది. ఈ నేపథ్యంలో డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌ వద్ద డ్రైపోర్ట్‌ ఏర్పాటు కోసం రాష్ట్రం 50 ఎకరాల భూమి కేటాయించాలి. కంటెయినర్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా ఇప్పటికే అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించడమే తరువాయి. జక్రాన్‌పల్లి గ్రీన్‌ఫీల్డ్‌ ఎయిర్‌పోర్ట్‌కు కూడా భూమి కేటాయించాలి.

– నల్ల దినేశ్‌రెడ్డి, జిల్లా చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అధ్యక్షుడు

నూతన అధ్యాయం మొదలవుతుంది



పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు నూతన అధ్యాయం మొదలుకానుంది. ఈ బోర్డు ఏర్పాటులో ఎంపీ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. పసుపు పంట సాగు చేసే రైతులకు ఇక నుంచి మంచి రోజులే. పసుపు పంటకు ఆశించిన ధర, నాణ్యమైన విత్తనాలు, సబ్సిడీ పరికరాలను అందించే అవకాశం ఏర్పడుతుంది.

– సోమ పెద్ద రాజారెడ్డి, సర్పంచ్‌, దిశ కమిటీ సభ్యులు, గుమ్మిర్యాల్‌

రైతులకు ఎంతో మేలు..



పసుపు సాగు చేసే రైతులకు మేలు జరుగడానికే పసుపు ప్రత్యేక బోర్డు. ఇప్పటి వరకు రైతులు ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చారు. ఇక నుంచి అందరికీ మంచి జరుగుతుంది. సాగు విస్తీర్ణం విషయంలో, పంటకు ధర నిర్ణయించే విషయంలోనూ బోర్డు కీలక పాత్ర పోషిస్తుంది. రైతులకు గతంలో కంటే ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగనున్నాయి.

– జైడి చిన్నారెడ్డి, రైతు, మోర్తాడ్‌

వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తాం



ధర్పల్లి బహిరంగ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

- రాష్ట్రంలో 35 మెడికల్‌ కళాశాలలు
- రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు
- ధర్పల్లిలో 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన
- మంత్రి వేముల, ఎంపీ బీబీపాటిల్‌, ఎమ్మెల్యేలు హాజరు



ధర్పల్లిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

డిచ్‌పల్లి / ధర్పల్లి : ప్రభుత్వ వైద్యవ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం నిజామాబాద్‌ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో రూ. 33 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవనానికి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. సిరికొండలోని చీమన్‌పల్లిలో రూ. 2 కోట్లతో నిర్మించ తలపెట్టిన పీహెచ్‌సీ భవనానికి శంకుస్థాపన చేశారు. బిచ్కుంద నుంచి హెలిక్యాప్టర్‌ ద్వారా ధర్పల్లికి చేరుకున్న మంత్రి హరీశ్‌రావుకు హెలిప్యాడ్‌ వద్ద ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్దన్‌, బిగాల గణేశ్‌గుప్తా, జెడ్పీ చైర్మన్‌ విఠల్‌రావు, కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్‌ తదితరులు స్వాగతం పలికారు. హరీశ్‌రావు వెంట జహీరాబాద్‌ ఎంపీ బీబీపాటిల్‌ హెలిక్యాప్టర్‌లో వచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ప్రశాంత్‌ రెడ్డి పాల్గొన్నారు.

సభలో మంత్రి హరీశ్‌రావు ప్రసంగిస్తూ కాంగ్రెస్‌, టీడీపీ పాలనలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు, వైద్యుల కొరత ఉండేదన్నారు. కేసీఆర్‌ నాయకత్వంలో హైదరాబాద్‌లో కొత్తగా 4 సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రులు, ప్రతి జిల్లాకు ఒక మెడికల్‌ కాలేజీ, మాతా శిశుసంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రూరల్‌ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్‌ అడిగిన వెంటనే ధర్పల్లిలో రూ. 33 కోట్లతో నూతనంగా 100 పడకల ఆస్పత్రిని, చీమన్‌పల్లిలో పీహెచ్‌సీని మంజూరు చేశామన్నారు. ఏడాదిలోగా వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. అందులోనే మాతాశిశు సంరక్షణ కేంద్రాన్నీ ఏర్పాటు చేస్తామన్నారు. సీఎం కేసీఆర్‌ రాష్ట్రంలో కొత్తగా 35 మెడికల్‌ కళాశాలలు ఏర్పాటు చేయగా 10వేల ఎంబీబీఎస్‌ సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలు కాంగ్రెస్‌, బీజేపీ నాయకులు చెప్పే మాయ మాటలకు మోసపోవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో రూరల్‌లో ఎమ్మెల్యే బాజిరెడ్డికి హ్యాట్రిక్‌ విజయం ఇవ్వాలని మంత్రి హరీశ్‌రావు కోరారు.

తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామి : ప్రశాంత్‌రెడ్డి

మంత్రి వేముల ప్రశాంత్‌ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా దూసుకెళ్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని 9 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. బాజిరెడ్డి గోవర్దన్‌ను రూరల్‌ ప్రజలు మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. రూరల్‌ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్‌ మాట్లాడుతూ.. రూరల్‌ నియోజకవర్గం అభివృద్ధి కోసం మరిన్ని నిధులివ్వాలని మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, హరీశ్‌రావులను కోరారు. నియోజకవర్గంలో 50శాతానికి పైగా ఉన్న మహిళా ఓటర్లు వందశాతం బీఆర్‌ఎస్‌కే మద్దతు తెలుపుతారన్నారు. ఇందల్వాయి లేదా డిచ్‌పల్లిలో ట్రామా కేర్‌ సెంటర్‌ ఏర్పాటు చేయాలన్నారు. 70 తండాలు జీపీలుగా ఏర్పడ్డాయని, వాటి అభివృద్ధికి నిధులివ్వాలని కోరారు. జక్రాన్‌పల్లిలో డ్రైపోర్ట్‌ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్‌ చైర్మన్‌ సాంబరి మోహన్‌, జెడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్‌, సుమనా రెడ్డి, మాన్‌సింగ్‌, ఎంపీపీ నల్ల సారిక హన్మంత్‌ రెడ్డి, నుడా చైర్మన్‌ ఈగ సంజీవ్‌రెడ్డి, స్థానిక సర్పంచ్‌ బాల్‌రాజ్‌, రైతుసమన్వయ సమితి అధ్యక్షుడు రాజ్‌పాల్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రమాదంలో హిందూమతం

వారంలో ఒక్కసారైనా ఆలయాలకు వెళ్లాలి

కమలానంద భారతి స్వామీజీ



జెండాను దర్శించుకుంటున్న భారతి స్వామీజీ

నిజామాబాద్‌ సిటీ : దేశంలో విడాకులు తీసుకుంటున్న కేసుల్లో 90 శాతం హిందూ మతాలకు చెందినవారే ఉన్నారని, హిందూ మతం ప్రమాదంలో ఉందని భువనేశ్వర పీఠం గన్నవరం విజయవాడ పీఠాధీశ్వరులు కమలానంద భారతి స్వామీజీ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని జెండా ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా జెండా బాలాజీ మందిరం, పూలాంగ్‌వాగు పక్కన నిలిపి ఉంచిన జెండాను స్వామిజీ దర్శించుకుని భక్తులకు ప్రవచనాలు చేశారు. పూర్వకాలంలో రామాయణం చదివినంత కాలం ఈ దేశంలో విడాకులు తీసుకోలేరని, భారతం చదివితే చెడిపోలేదన్నారు. అవి రెండు వదిలేసిన తర్వాతే సమాజం పాడైపోతుందన్నారు. వారంలో ఒకరోజు మీకు దగ్గరలోని ఆలయాలకు కుటుంబంతో కలిసి ప్రశాంతంగా వెళ్లాలని, మీ బంధం మరింత ధృడంగా మారుతుందన్నారు. దేవాలయానికి వెళ్లేది దేవుడి అనుగ్రహాన్ని పొందటానికే కాదని, దేవుడి నుంచి దైవగుణాలని పొందాలన్నారు. తిరుమల వేంకటేశ్వర స్వామికి ఇక్కడి నుంచి అనేక వస్తువు లు వెళ్తుంటాయని, కానీ నిజామాబాద్‌ నగరంలో తిరుమల వెంకటేశ్వర స్వామి స్వయంగా జెండా బాలాజీగా కొలువై ఉన్నాడని, ఇంతటి పురాతన చరిత్ర, మహిమ కలిగిన ఆలయం జెండా సంస్కృతి ఇక్కడ ఉండటం ఈ ప్రాంత వాసుల అదృష్టమన్నారు. అందుకే బాలాజీ మందిరంలో స్వామివారికి పట్టువస్త్రాలు పంపాలని టీటీడీ చైర్మన్‌కు ఇక్కడి భక్తులు అర్జీ పెట్టుకుంటే తప్పకుండా వస్తాయన్నారు. అనంతరం స్వామిజీకి సంగ్వాయి పరివార్‌ పాదుక పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంజయ్‌, అజయ్‌, విజయ్‌, కందకురి ఆనంద్‌, ఇరుముల వినయ్‌, సార్వజనిక్‌ గణేష్‌ మందిరం అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పోషకాహారం అందించేందుకే సీఎం బ్రేక్‌ఫాస్ట్‌





వేల్పూర్‌ హైస్కూల్‌లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే బిగాల

- తాను చదివిన స్కూల్‌లో కార్యక్రమం ప్రారంభించడం సంతోషంగా ఉంది
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్‌ : విద్యార్థులకు పోషకాహారం అందించడం కోసమే సీఎం కేసీఆర్‌ 'బ్రేక్‌ఫాస్ట్‌' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్‌ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 'ముఖ్యమంత్రి అల్పాహారం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనరంజక పాలనను అందిస్తున్న కేసీఆర్‌ మానవీయ కోణంలో ఆలోచించి 'బ్రేక్‌ఫాస్ట్‌' కార్యక్రమాన్ని అమలుచేస్తున్నారన్నారు. ఇందుకోసం ప్రభుత్వం సుమారు రూ. 500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఒకప్పుడు 200 రెసిడెన్షియల్‌ స్కూల్స్‌ ఉంటే, సీఎం కేసీఆర్‌ 1000కిపైగా రెసిడెన్షియల్‌ పాఠశాలలు నెలకొల్పినట్లు పేర్కొన్నారు. బ్రేక్‌ఫాస్ట్‌ విషయంలో శుభ్రత పాటించాలని ఉపాధ్యాయులకు, నిర్వాహకులకు సూచించారు. డీఈవో దుర్గాప్రసాద్‌, ఎంపీపీ బీమ జమున, సర్పంచ్‌ తీగెల రాధామోహన్‌, ఉపసర్పంచ్‌ పిట్ల సత్యం ఎంపీటీసీ మొండి మహేశ్‌, ఆర్డీవో వినోద్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు రాములు, నాగధర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..

నిజామాబాద్‌ అర్బన్‌ : జిల్లా కేంద్రంలోని పోలీస్‌లైన్‌ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జెడ్పీ చైర్మన్‌ విఠల్‌రావుతో కలిసి ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు 'ముఖ్యమంత్రి అల్పాహారం' పథకాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి టిఫిన్‌ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున మొత్తం ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో తొలి విడత 'సీఎం బ్రేక్‌ఫాస్ట్‌' పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్‌ నీతూకిరణ్‌, నగర పాలక సంస్థ కమిషనర్‌ మకరంద్‌, జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్‌ బీ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ముందు 30 శాతం ఇవ్వాల్సిందే..

- మొదటి విడత దళితబంధు కోసం నగరానికి చెందిన రాజేశ్‌ (పేరుమార్చం) డివిజన్‌స్థాయి నాయకుడిని కలిశారు. ప్రజాప్రతినిధి క్యాంపు ఆఫీసుకు వెళ్లినా, ప్రజాప్రతినిధిని కలిసినా దళితబంధు రాదని.. 30 శాతం వాటా ముందుగానే ఇస్తే కచ్చితంగా జాబితాలో పేరు ఉంటుందని సదరు నాయకుడు స్పష్టం చేశాడు. దీంతో రాజేశ్‌ ఒప్పందం ప్రకారం 30 శాతం ముందుగానే ముట్టజెప్పారు. ఆ నాయకుడు అందులో నుంచి 20 శాతం వాటా ప్రజాప్రతినిధి షాడోకు ఇచ్చి 10 శాతం తను తీసుకున్నాడు. లబ్ధిదారుడుకి దళితబంధు వచ్చింది.

- దళిత, బీసీ, మైనారిటీబంధు ఏదైనా కమీషన్‌ ముట్టజెప్పాల్సిందే!
- అంతా షాడో కనుసన్నల్లోనే..
- రెండో విడత దళితబంధులో ఇప్పటికే ముట్టిన పర్సెంటేజీలు

నిజామాబాద్‌నాగారం: దళిత బంధులో పలుచోట్ల నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులే ముప్పై శాతం కమీషన్లు తీసుకుంటున్నారని బహిరంగంగానే విమర్శలు వ్యక్త మవుతుండగా, నిజామాబాద్‌ అర్బన్‌లో మాత్రం షాడోగా వ్యవహరించే వ్యక్తి ముప్పై శాతం ముందే ఇవ్వాలని డిమాండ్‌ చేస్తున్నట్లు తెలిసింది. తనకు అత్యంత సన్నిహితంగా మెలిగే వారి ద్వారా కమీషన్లు వసూలు చేయిస్తూ సదరు ప్రజాప్రతినిధికి తెలియకుండానే లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేస్తున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. నగరంలో 500 మందికి రెండో విడత దళితబంధు ఇవ్వడానికి కసరతు చేస్తున్నారు. సర్వే చేసే పని మున్సిపల్‌ అధికారులదే అయినప్పటికీ.. 'బంధు' ఇచ్చేది మాత్రం షాడో చెప్పిన వారికే కావడం గమనార్హం. ఇప్పటికే పర్సంటేజీలు ముట్టినట్లు ప్రచారం జరుగుతోంది.

మొదటి విడతలో రూ. 3 కోట్లు

ప్రతి నియోజకవర్గంలో వందమందికి దళితబంధు ద్వారా లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. నగర పరిధిలోని 60 డివిజన్లలో 30 శాతం ముందుగానే చెల్లించే వారిని ఎంపిక చేసేలా షాడో ప్రణాళిక రూపొందించాడు. తనకు సన్నిహితులైన నాయకుల ద్వారా కమీషన్లు వసూలు చేసిన షాడో.. ప్రజాప్రతినిధికి తెలియకుండానే లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేశాడనే ఆరోపణలున్నాయి. మొదటి విడత దళితబంధు లబ్ధిదారుల ఎంపిక సందర్భంగా షాడో ఏకంగా రూ.3కోట్లు వసూలు చేసినట్లు నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.



జీసీ, మైనారిటీ బంధులోనూ వసూళ్లు

ప్రభుత్వం కులవృత్తుల వారికి బీసీ బంధు అమలు చేసింది. ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీలకు మైనారిటీ బంధు ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో బీసీలు, మైనారిటీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. బీసీ బంధు కోసం 3 వేలకుపైగా, మైనారిటీ బంధు కోసం 6 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. బీసీలో 300 మందిని, మైనారిటీలో 200 మందిని ఎంపిక చేసి రూ.లక్ష చొప్పున లబ్ధిచేకూర్చారు. అయితే రూ.లక్ష ఆర్థికసాయం అందాలంటే.. ముందుగానే తమ నుంచి రూ.20వేల నుంచి రూ. 30వేల చొప్పున వసూలు చేసినట్లు లబ్ధిదారులే బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

ఆడిట్‌ పేరుతో వసూళ్లు..!

- అందినకాడికి దండుకున్న ఉపాధి హామీ టెక్నికల్‌ అసిస్టెంట్‌
- పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌ అసిస్టెంట్లే బాధితులు
- డొంకేశ్వర్‌లో బయటపడ్డ 'టీఏ' బాగోతం



డొంకేశ్వర్‌(ఆర్మూర్‌) : ఉపాధిహామీ సోషల్‌ ఆడిట్‌లో అభ్యంతరాలు రాకుండా నేను చూస్కుంటా.. కాకపోతే ఆడిట్‌కు వచ్చిన అధికారులకు ముడుపులు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పి ఉపాధిహామీ టెక్నికల్‌ అసిస్టెంట్‌(టీఏ) ఒకరు వసూళ్లకు తెరలేపాడు. ఒక్కో జీపీ నుంచి రూ. వేలల్లో వసూళ్లు చేసినట్లు బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇచ్చింది పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌ అసిసెంట్లే కావడంతో డొంకేశ్వర్‌లో మండలంలో ఇంత వరకు ఈ విషయం బయటకు పొక్కలేదు. ఐతే వసూలు చేసిన మొత్తం నిజంగానే ఆడిట్‌ అధికారులకు అందిందా..? సదరు టీఏనే జేబులో వేసుకున్నాడా..? అనేది కూడా సందేహంగానే ఉంది. డొంకేశ్వర్‌ మండలంలోని 13 గ్రామాల్లో గత రెండేళ్లలో జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం ఇటీవల తనిఖీలు నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించి పనుల్లో ఏమైనా తేడాలున్నాయా పరిశీలించారు. ఆడిట్‌ పేరాల్లో అభ్యంతరాలు రాస్తే తమపై ఎలాంటి చర్యలు ఉంటాయోనని పంచాయతీ కార్యదర్శులు ఆందోళనకు గురయ్యారు. మెటీరియల్‌ పనులకు మెజర్‌మెంట్స్‌ చేయడంలో కీలకంగా వ్యవహరించే టెక్నికల్‌ అసిస్టెంట్‌ ఇక్కడే తన టెక్నిక్‌ను ఉపయోగించాడు. చిన్నచిన్న పొరపాట్లను ఆడిట్‌ పేరాల్లో రాకుండా చూస్తానని చెప్పి ఒక్కొక్కరి వద్ద రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేసినట్లు తెలిసింది.

ప్రతీపనికి చేయి తడపాల్సిందే..

టెక్నికల్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సదరు ఉద్యోగికి మరొక అదనపు బాధ్యత కూడా ఉంది. ఉపాధి హామీ పనులు మంజూరు కావాలన్నా, వాటికి మెజర్‌మెంట్లు తీసి ఎంబీ రికార్డు చేసి అంతా సవ్యంగా ఉందని రిపోర్టు ఇవ్వాలన్నా ఆయనే కీలకం. మండలానికి కొంత కాలంగా రెగ్యులర్‌ ఏపీవో లేకపోవడంతో వసూళ్లకు పాల్పడుతున్నా అతనిపై ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం. సదరు టీఏ వసూళ్ల వ్యవహారంపై స్థానిక ఏపీవో సవితను 'సాక్షి' వివరణ కోరగా, ఈ విషయం తన దృష్టికి రాలేదని, తాను కొత్తగా వచ్చానని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు రగ్బీ జిల్లా జట్ల ఎంపిక

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మండలంలోని మోపాల్‌ జడ్పీ హైస్కూల్‌లో ఉమ్మడి జిల్లా రగ్బీ అండర్‌–19 ఎంపిక పోటీలు శనివారం నిర్వహించనున్నట్లు పీడీ అబ్బయ్య శుక్రవారం తెలిపారు. డీఐఈవో రఘురాజ్‌, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ గంగాధర్‌ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ఉంటాయన్నారు. స్టేట్‌ మీట్‌ టోర్నమెంట్‌ మహబూబాబాద్‌లో ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు లీగల్‌ సర్వీస్‌ మాడ్యుల్‌ క్యాంప్‌

ఖలీల్‌వాడి: నగరంలోని నూతన కలెక్టరేట్‌ కాన్ఫరెన్స్‌హాల్‌లో లీగల్‌ సర్వీస్‌ మాడ్యుల్‌ క్యాంప్‌ను శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్‌, జిల్లా జడ్జి సునీత కుంచాల శుక్రవారం తెలిపారు. ఈ సమావేశం హైదరాబాద్‌, నిజామాబాద్‌ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి అతిథులుగా సామ్‌ కోస్సి, హైకోర్టు జడ్జి సుమలత, తెలంగాణ లీగల్‌ సర్వీస్‌ అథారిటీ మెంబర్‌ సెక్రటరీ గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్‌, సీపీ హాజరుకానున్నట్లు వెల్లడించారు.

సేంద్రియ పద్ధతులు పాటించాలి



మోర్తాడ్‌: పసుపు పంట సాగులో సేంద్రియ పద్ధతులను పాటించాలని స్పైసిస్‌ బోర్డుడిప్యూటీ డైరెక్టర్‌ సుందరేషన్‌ సూచించారు. మండలంలోని వడ్యాట్‌లో పసుపు పంటను శుక్రవారం పరిశీలించారు. రసాయనాల వాడకంతో నాణ్యత దెబ్బ తింటుందని అన్నారు. నాణ్యమైన పసుపుకు జీవ ఎరువులు, జీవ రసాయనాలు వినియోగిస్తే బాగుంటుందని చెప్పారు. ఆయన వెంట పసుపు పరిశోధన సంస్థ శాస్త్రవేత్త మహేందర్‌, ఐసీఐసీఐ ఫౌండేషన్‌ ప్రతినిధులు, ఏఈవో మోహన్‌, నిమ్మల నర్సయ్య ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



సిరికొండ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గ్రామాల్లో ఎవరూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని డీసీపీ జయరాం సూచించారు. మండల కేంద్రంలోని పీఎస్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని అన్నారు. ఆయన వెంట ఎస్సై, సిబ్బంది ఉన్నారు.

వాహనాల తనిఖీలో రూ. 5 లక్షలు సీజ్‌

ఖలీల్‌వాడి: నగరంలోని గంజి కమాన్‌ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు శుక్రవారం తెలిపారు. తనిఖీలో బూరుగుపల్లి వీరేందర్‌ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. ఐదు లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సీజ్‌ చేసిన డబ్బును విచారణ నిమిత్తం ఐటీ అధికారులకు అందజేస్తామని తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

నవీపేట(బోధన్‌): మండలంలోని మద్దెపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యే షకీల్‌ కారును అడ్డుకునే ప్రయత్నం చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ శుక్రవారం తెలిపారు. ఈనెల 5న మద్దేపల్లిలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసి తిరుగు ప్రయాణంలో మద్దేపల్లి తండావాసులు ఎమ్మెల్యే కారును తండాకు చెందిన మారుతి, సేవాలాల్‌, ఆమ్రు, సునీతాబాయి, సంగుబాయి, లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తాగి దొరికితే జైలుకే..

- డ్రైవింగ్‌ లైసెన్సులు రద్దు
- కుటుంబసభ్యుల ముందే కౌన్సెలింగ్‌
- జనవరి నుంచి సెప్టెంబర్‌ వరకు 1700 కేసులు

నగరంలోని ఒకటో టౌన్‌ పీఎస్‌ పరిధిలో ఓ వ్యక్తి డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ తనిఖీలో పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో బ్రీత్‌ ఎనలైజర్‌తో పరీక్షించగా మోతాదుకు మించి తాగినట్లు గుర్తించడంతో రెండు రోజుల జైలు శిక్ష విధించారు. ఇప్పటి వరకు జిల్లాలో మద్యం తాగి పట్టుబడి జైలు శిక్ష కొందరు అనుభవించి వచ్చారు.

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. గతంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారు కోర్టులో జరిమానా చెల్లించి తప్పించుకునే వారు. జిల్లాలో మద్యం మత్తులో అనేక మంది ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం నూతన ఆదేశాలను జారీ చేసింది. ఇకపై తాగి వాహనాలు నడిపే వారిపై జరిమానాతో పాటు జైలు శిక్ష, వాహన లైసెన్స్‌ రద్దు చేసేలా చర్యలు తీసుకుంటోంది. నిజామాబాద్‌ కమిషనరేట్‌ పరిధిలో పోలీసులు అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టినా మద్యం ప్రియుల్లో మాత్రం మార్పు కనిపించడం లేదు. దీంతో మద్యం తాగి వాహనాలు

సంవత్సరం	కేసులు	జైలు శిక్ష పడ్డ వారి సంఖ్య
2021	4226	7
2022	11684	18
2023	1700	4(జనవరి నుంచి సెప్టెంబర్‌)



నడిపే వారిపై పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

మందుబాబులకు కౌన్సెలింగ్‌

మద్యం తాగి దొరికిన వారికి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్‌ నిర్వహిస్తున్నారు. కౌన్సెలింగ్‌లో మద్యం తాగి నడిపిస్తే కలిగే నష్టాలను వాహనాదారుడికి, కుటుంబసభ్యులకు వివరిస్తున్నారు. మద్యం తాగి దొరికిన వారి వివరాలు పీఎస్‌లో నిక్షిప్తమై ఉంటాయి. నగరంతోపాటు మండల కేంద్రంలో కూడా పోలీసులు మధ్యాహ్న సమయంలో డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నారు. మద్యం తాగి దొరికిన వారిని కోర్టులో హాజరు పర్చడంతో వారికి కోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తోంది.

కోర్టు నిర్ణయం మేరకు..

మద్యం తాగి దొరికిన వారిపై కోర్టు జైలు శిక్ష విధించడంతోపాటు జరిమానా విధిస్తారు. మొదటి సారి కాకుండా రెండోసారి దొరికిన వారి డ్రైవింగ్‌ లైసెన్స్‌ను రద్దు చేయాలని కోర్టు రవాణా శాఖకు సిఫార్సు చేస్తోంది. వాహనాదారుల డ్రైవింగ్‌ లైసెన్స్‌లను కోర్టు నిర్ణయం మేరకు ఏడాది నుంచి ఆరు నెలల వరకు రద్దు చేసే అవకాశం ఉంది.

కోర్టుకు పంపిస్తున్నాం..

తాగి వాహనాలు నడిపి తనిఖీలో పట్టుబడితే వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నాం. కోర్టు వారికి జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తోంది. తాగి నడిపితే జరిగే పరిణామాలపై కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్‌ ఇస్తున్నాం. ఎవరైనా మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవు.

–చందర్‌రాథోడ్‌, ట్రాఫిక్‌ సీఐ, నిజామాబాద్‌

వివాదాస్పదమైన కుట్టుమిషన్ల పంపిణీ

మోర్తాడ్‌(బాల్కొండ): మైనార్టీ కార్పొరేషన్‌ ద్వారా చేపట్టిన కుట్టు మిషన్ల పంపిణీ మోర్తాడ్‌లో తీవ్ర వివాదాస్పదమైంది. అర్హులైన వారికి కాకుండా ఆర్థికంగా స్థితిమంతులైన వారికి పంపిణీ చేశారంటూ మైనార్టీలు కొందరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. మోర్తాడ్‌కు 40 కుట్టు మిషన్లు మంజూరు కాగా వాటిని తమ వర్గానికి చెందిన నాయకుడే అర్హులకు కాకుండా ఇతరులకు పంపిణీ చేశారంటూ ఆరోపించారు. దరఖాస్తుల స్వీకరణలో ఎవరికి సమాచారం ఇవ్వకుండా అనుకూలమైన వారితో దరఖాస్తులను తీసుకుని వారికే మిషన్లను కేటాయించారని వివరించారు. ఇటీవల లక్కోరా ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్‌ అలీ ఆధ్వర్యంలో కొంత మందికి కుట్టు మిషన్లను పంపిణీ చేయగా మిగిలిన వారికి గురువారం పంపిణీ చేశారు. ఈ పంపిణీలో అర్హులకు అన్యాయం జరిగిందని వారు నిరసన తెలిపారు.



ఆందోళన చేస్తున్న మైనార్టీ మహిళలు

తెయూ సమాచారం

న్యాయశాస్త్ర పరిశోధక విద్యార్థికి డాక్టరేట్‌



తెయూ(డిచ్‌పల్లి): తెయూలో న్యాయశాస్త్ర పరిశోధక విద్యార్థి జీవీమహేశ్‌నాథ్‌ పీహెచ్‌డీ డాక్టరేట్‌ శుక్రవారం సాధించారు. మహేశ్‌నాథ్‌ ప్రస్తుతం మేడ్చల్‌ జిల్లా సీనియర్‌ సివిల్‌ జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు. లా బోర్డ్‌ ఆఫ్‌ స్టడీస్‌ చైర్మన్‌ జెట్లింగ్‌ ఎల్లోసా పర్యవేక్షణలో 'రైట్‌ టూ ప్రైవసీ అండ్‌ డాటా ప్రొటెక్షన్‌ లాస్‌ ఇన్‌ సైబర్‌ స్పేస్‌ – నేషనల్‌ అండ్‌ ఇంటర్నేషనల్‌ పర్స్పెక్టివ్‌' అనే అంశంపై మహేశ్‌నాథ్‌ పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. అనంతరం మహేష్‌నాథ్‌ను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో లా డీన్‌ ప్రొఫెసర్‌ ఎం.శ్రీనివాస్‌, హెచ్‌వోడీ ప్రిన్సిపాల్‌ కె.ప్రసన్నరాణి, అధ్యాపకులు బి.స్రవంతి, ఎం.నాగజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈసీ తీర్మానాలు అమలు చేయాలి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పాలకమండలి తీర్మానాలు అమలు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్‌ చేశారు. శుక్రవారం తెయూ పరిపాలనా భవనం ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తెయూ వీసీ, రిజిస్ట్రార్‌ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈసీ తీర్మానాలు ఇప్పటి వరకు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. వి.సంతోష్‌, జయంతి, శివసాయి, రవీందర్‌, అక్షయ్‌ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్ల ఎంపిక



తెయూ(డిచ్‌పల్లి): తెయూ ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో వెస్ట్‌జోన్‌ ప్రీ–రిపబ్లిక్‌ డే పరేడ్‌కు ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్ల ఎంపిక పోటీలు నిర్వహించినట్లు ఎన్‌ఎస్‌ఎస్‌ కో–ఆర్డినేటర్‌ కె.రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తెయూ క్యాంపస్‌లో జరిగిన పోటీలకు న్యాయనిర్ణేతగా ఎన్‌ఎస్‌ఎస్‌ రీజినల్‌ డైరెక్టర్‌ రామకృష్ణ వ్యవహరించారు. వలంటీర్లకు పరుగుపందెం, పరేడ్‌, కల్చరల్‌ పోటీలు నిర్వహించారు. ఎంపికైన వారు 2024 జనవరి 26న న్యూఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్‌ డే పరేడ్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ రీజినల్‌ కార్యాలయ అధికారి సంజయ్‌, గీత, ప్రసన్న, సంపత్‌, మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడులు

ఖలీల్‌వాడి: వ్యభిచార గృహంపై పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్ట్‌ చేయగా ఐదుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని దుబ్బ ప్రాంతంలో కొన్ని రోజులుగా వ్యభిచారం నిర్వహిస్తున్న కేంద్రంపై సీపీ ఆదేశాల మేరకు సీఐ నరహరి, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయగా మహిళలను అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్‌ నిమిత్తం సఖీ కేంద్రానికి తరలించారు. వ్యభిచార నిర్వాహకురాలు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. దాడిలో పోలీసులు రూ.16,100 నగదు, 7 సెల్‌ ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైనా వ్యభిచారం, పేకాట, గంజాయి లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో రెండో టౌన్‌ ఎస్సై అశోక్‌, సిబ్బంది ఉన్నారు.

అటెండెన్స్‌ రిజిస్టర్‌ మాయం

- మెంట్రాజ్‌పల్లి పాఠశాలలో ఘటన

నిజామాబాద్‌అర్బన్‌: డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల అటెండెన్స్‌ రిజిస్టర్‌ మాయమైంది. ఈ విషయమై హెచ్‌ఎం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పాఠశాలలో 309 మంది విద్యార్థులు ఉండగా, తొమ్మిది మంది టీచర్లు బోధిస్తున్నారు. నాన్‌టీచింగ్‌ ఉద్యోగి ఒకరు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెల 3న పాఠశాలలో టీచర్లు సాయంత్రం వేళ రిజిస్టర్‌లో సంతకం చేశారు. మరుసటి రిజిస్టర్‌ మాయమవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇద్దరు టీచర్లను రిలీవ్‌ చేయడం లేదనే కారణం లేదా రిజిస్టర్‌లో సంతకం చేయని ఓ టీచర్‌తో హెచ్‌ఎం సంతకం చేయించడం కారణంగానే రిజిస్టర్‌ను మాయం చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై విచారణ చేయించాలని డీఈవోకు హెచ్‌ఎం విన్నవించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్‌: జిల్లా సమాచారశాఖలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్‌ పబ్లిక్‌ రిలేషన్‌ ఆఫీసర్‌, పబ్లిసిటీ అసిస్టెంట్‌ పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్‌ రా జీవ్‌గాంధీ హనుమంతు శుక్రవారం తెలిపారు. ఔట్‌సోర్సింగ్‌ పద్ధతిలో నియామకాలు చేస్తామని, నేటి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డీపీఆర్వో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు పద్మశ్రీ, డీపీఆర్వో 86882 61262, మాజిద్‌ 99493 51684 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆర్‌ఎస్‌ఈటీఐ ఆధ్వర్యంలో..

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్‌ ఎస్‌.శ్రీనివాస్‌ శుక్రవారం తెలిపారు. 30 రోజుల శిక్షణలో ఉచిత భోజన సదుపాయం, హాస్టల్‌ వసతి ఉంటుందని అన్నారు. ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాకు చెందిన గ్రామీణ మహిళలు 19 నుంచి 45 సంవత్సరాలు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తమ వెంట ఆధార్‌ కార్డ్‌, రేషన్‌ కార్డ్‌, పదోతరగతి ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజ్‌ ఫొటోలతో వచ్చి కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08461–295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థినికి సన్మానం



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికైన శ్రీనూతన వైశ్య ఉన్నత పాఠశాల విద్యార్థిని త్రివేణిని ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల పాలక వర్గ అధ్యక్షుడు ధన్‌పాల్‌ శ్రీనివాస్‌గుప్తా, కార్యదర్శి శివప్రసాద్‌గుప్తా, ఈసీ వైస్‌చైర్మన్‌ కటకం సతీశ్‌ గుప్తా, కార్యవర్గ సభ్యులు కోటగిరి రమేశ్‌గుప్తా, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుజ్జుల్‌ తండాలో యువకుడి అదృశ్యం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గుజ్జుల్‌ తండాలో బానోత్‌ గణేశ్‌ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై ప్రేమ్‌దీప్‌ శుక్రవారం తెలిపారు. గత నెల 27న ఇంటి నుంచి వెళ్లిన గణేశ్‌ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



బానోత్‌ గణేశ్‌

లక్ష్యం దిశగా విద్యుదుత్పత్తి

- ఆర్థిక సంవత్సర లక్ష్యం 75 మిలియన్‌ యూనిట్లు
- ఇప్పటి వరకు 40 మి.యూ.కు చేరిన వైనం



జలవిద్యుత్‌ కేంద్రంలో టర్బయిన్లు

బాల్కొండ: ఎస్సారెస్పీలోని జల విద్యుదుత్పత్తి కేంద్రంలో లక్ష్యం దిశగా విద్యుదుత్పత్తి సాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జలసౌధ 75 మిలియన్‌ యూనిట్ల విద్యుదుత్పత్తిని లక్ష్యంగా విధించగా ఇప్పటి వరకు 40 మి.యూ. విద్యుదుత్పత్తి జరిగింది. ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి లక్ష్యానికి చేరుకుంటామని జెన్‌కో అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతేడాది అక్టోబర్‌లోనే 75 మిలియన్‌ యూనిట్లకు మించి విద్యుదుత్పత్తి లక్ష్యం జరిగింది. గతేడాది జల విద్యుతుత్పత్తి కేంద్రం చరిత్రలోనే రెండో అతి ఎక్కువగా 139 మిలియన్‌ యూనిట్ల విద్యుతుత్పత్తి జరిగింది. ప్రస్తుత సంవత్సరం అంతగా చేపట్టే అవకాశం లేకున్నా లక్ష్యాన్ని మాత్రం పూర్తి చేస్తామని జెన్‌కో అధికారులు పేర్కొంటున్నారు.

సామర్థ్యానికి మించి..

ఎస్సారెస్పీలోకి ప్రస్తుత సంవత్సరం ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరదలు రావడంతో ప్రాజెక్ట్‌ నుంచి మిగులు జలాలను జూలైలో అధికారులు వదిలి పెట్టారు. దీంతో ఎస్కేప్‌ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కుల వరద గోదావరిలోకి వదులుతూ జల విద్యుదుత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పత్తి చేపట్టారు. నాలుగు టర్బయిన్ల ద్వారా 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. గరిష్ఠంగా 36.48 మెగావాట్ల విద్యుదుత్పత్తిని కూడా చేపట్టారు.

కొనసాగుతున్న ఉత్పత్తి

ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల కొనసాగుతుండడంతో ప్రాజెక్ట్‌ వద్ద ఉన్న జల విద్యుతుత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. మూడు వేల క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండడంతో నానలుగు టర్బయిన్లతో 12 మెగావాట్ల విద్యుతుత్పత్తి జరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 40 మిలియన్‌ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగిందని జెన్‌కో అధికారులు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

డిచ్‌పల్లి: మారుతున్న సీజన్‌లో దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు ప్రబలుతాయని జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్‌ అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలో 'జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ చర్యలు' అనే అంశంపై శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఫ్రై డే రోజు డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్‌, ఆరోగ్య పర్యవేక్షకుడు అక్బర్‌అలీ, ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుకారాం రాథోడ్‌

జీజీహెచ్‌లో క్యాథ్‌ ల్యాబ్‌

- రూ. 6.46 కోట్లతో ఏర్పాటు
- ప్రారంభం కానున్న హృద్రోగ వ్యాధి సేవలు

నిజామాబాద్‌ నాగారం : జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో మరిన్ని వైద్యసేవలను పెంచుతున్నట్లు ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా పేర్కొన్నారు. శుక్రవారం జీజీహెచ్‌లో ఆయన క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ రూ. 6.46 కోట్లతో ఏర్పాటు చేసిన క్యాథ్‌ ల్యాబ్‌లో గుండె సంబంధిత చికిత్సను రోగులకు అందిస్తారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి అంటే ఆందోళన చెందకుండా స్నేహపూర్వక వాతావరణంలో చికిత్సలు జరుగుతాయన్నారు. జీజీహెచ్‌లో వైద్యులు అరుదైన ఆపరేషన్లు చేస్తూ, అరుదైన వ్యాధులకు చికిత్సని అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్‌ దండు నీతూకిరణ్‌, డిప్యూటీ మేయర్‌ ఇద్రిస్‌ ఖాన్‌, నుడా డైరెక్టర్‌ మల్లేశ్‌ గుప్తా, కార్పొరేటర్లు బబ్లు ఖాన్‌, షకీల్‌, జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ ప్రతిమారాజ్‌, డిప్యూటీ సూపరింటెండెంట్‌ బాలరాజు, డీఎంహెచ్‌వో సుదర్శనం, మెడికల్‌ కళాశాల ప్రిన్సిపల్‌ ఇందిరా, నాయకులు పాల్గొన్నారు.

నేడు స్వగ్రామానికి ఆర్మీజవాన్‌ మృతదేహం

బోధన్‌: సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లికి చెందిన ఆర్మీ జవాన్‌ గంగాప్రసాద్‌ మృతదేహం శనివారం ఉదయం స్వగ్రామానికి చేరుకోనుంది. సిక్కిం రాష్ట్రంలో మంగళవారం రాత్రి సంభవించిన వరదల్లో గల్లంతై మృతిచెందిన విషాద ఘటన తెలిసిందే. గల్లంతైన జవాన్ల ఆచూకీ కోసం గాలింపులో గంగాప్రసాద్‌ మృతదేహం గురువారం లభ్యమైనట్లు ఆర్మీ అధికారులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఆయన మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పశ్చిమ బెంగాల్‌ రాష్ట్రంలోని జల్పాయగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా శుక్రవారం పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయిందని అక్కడికి వెళ్లిన జవాన్‌ బంధువులు ఫోన్‌లో సమాచారం అందించారు. జవాన్‌ మతదేహాన్ని శనివారం ఉదయం హైదరాబాద్‌కు విమానంలో తీసుకొచ్చి, అక్కడ నుంచి స్వగ్రామమైన పంపేలా ఆర్మీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్మీ జవాన్‌ కుటుంబాన్ని ఎమ్మెల్యే షకీల్‌ పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.



జవాన్‌ కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్‌

బాన్సువాడ: పట్టణంలోని బేతాళస్వామి ఆలయ ప్రాంతంలో చోరీకి పాల్పడిన ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడ పీఎస్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. ఈ నెల 3న పాత బాన్సువాడలోని బేతాళస్వామి ఆలయ ప్రాంతంలో బోడ ప్రమోద్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డిల ఇంట్లో రూ. 4 లక్షల నగదును దుండగులు దొంగిలించారు. విచారణలో ఇంట్లో పనిచేసే బుశబోయిన గంగామణి, సాయిలు నగదు దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. దీంతో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసును త్వరగా ఛేదించిన సిబ్బందికి ఎస్పీ రివార్డు అందజేసి అభినందించారు. సమావేశంలో సీఐ మహేందర్‌రెడ్డి, ఏఎస్సై రాములు, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో అప్పుల బాధతో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేశ్‌ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీకి చెందిన అల్లం రాములు (35) ఉపాధి నిమిత్తం దుబాయికి మూడేళ్ల క్రితం వెళ్లి వచ్చాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



రాములు (ఫైల్‌)

క్రైం కార్నర్‌

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్‌, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు సత్యంరెడ్డి (75) శుక్రవారం అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సత్యంరెడ్డి హైదరాబాద్‌లోని ప్రైవేట్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య శోభాంజలి, ఇద్దరూ కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. హైదరాబాద్‌లో శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.



సత్యంరెడ్డి (ఫైల్‌)

బోరు మోటార్‌ను బయటకు తీస్తుండగా..

మోర్తాడ్‌(బాల్కొండ): మండలంలోని సుంకెట్‌లో కూలీ పని చేసే ఆకుల బాలకిషన్‌(37) విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఏఎస్సై గోపాల్‌ తెలిపారు. రామన్నపేట్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం బోరు మోటారును బయటకు తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బాలకిషన్‌ అంత్యక్రియల్లో కాంగ్రెస్‌ నాయకుడు సునీల్‌రెడ్డి పాల్గొని బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

నందిపేట్‌ (ఆర్మూర్‌): మండల కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌ కాలనీలో డొంకేశ్వర్‌ మండలం అన్నారం గ్రామానికి చెందిన రెడ్డి భూమన్న(53) అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రాహుల్‌ శుక్రవారం తెలిపారు. రెడ్డి భూమన్న వృత్తిరీత్యా కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం ఉదయం ఉమ్మడి గ్రామానికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం ఎన్టీఆర్‌ నగర్‌ కాలనీలోని చర్చి వద్ద మృతిచెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా విచారణలో భూమన్న మృతదేహంగా తేలింది. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



భూమన్న మృతదేహం

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): ఆర్టీసీ డ్రైవర్‌ నిర్లక్ష్యంతో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల శివారులోని ధర్మారావ్‌పేట్‌–అమర్లబండకు వెళ్లే ప్రధాన రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. అమర్లబండ గ్రామానికి చెందిన ఎర్రొల్ల లింగయ్య(70) సదాశివనగర్‌ నుంచి స్వగ్రామానికి టీవీఎస్‌ ఎక్సెల్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా కామారెడ్డి వైపునకు వస్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొన్నది. దీంతో వెనుక టైర్ల కింద పడ్డ లింగయ్య తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన డ్రైవర్‌ పారిపోయి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు భారీ ఎత్తుల ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే ఫోన్‌లో హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.



లింగయ్య (ఫైల్‌)

రైలు ఢీకొని మరొకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని అర్సపల్లి రైల్వే గేట్‌ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతి చెందినట్లు రైల్వే ఇన్‌చార్జి ఎస్సై తావూనాయక్‌ తెలిపారు. మృతుడి వయస్సు 25 సంవత్సరాలు ఉంటుందని అన్నారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఎవరైనా మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712658591, 8712568511 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

